క్లుప్తంగా

నూతన గ్రౌండ్‌ను వాకర్స్ సద్వినియోగం చేసుకోవాలి


కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : కడప నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను వాకర్స్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల పలువురు పెరేడ్ గ్రౌండ్‌లో తాము నడక, ఇతర వ్యాయామాలు చేసేందుకు వినియోగించుకోవడానికి వీలుగా అనుమతి ఇవ్వాలని జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ.. వాకర్స్ గ్రౌండ్‌ను వినియోగించుకోవాలని, ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణకు వ్యాయామాలు చేయాలని సూచించారు.

30 నుంచి సమరభేరీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సమర భేరీ నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం సీపీఎం కార్యాలయంలో సమర భేరీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు అధిక ధరలతో అల్లాడుతుంటే మోడీ అధికారంలోకి వచ్చాక వంట గ్యాస్ ధర రూ. 450 ఉంటే దానిని రూ. 1200 పెంచడంతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతంగా పెంచారన్నారు. ఈ సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళనలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసులు రెడ్డి, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులకు వేతనాలను పెంచాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆప్కాస్ ఉద్యోగులకు వేతనాలను పెంచాలని ఆప్కాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుక్కే అంజి నాయక్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రిషికేశవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో గురువారం ఏడురోడ్ల వద్దగల డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి దంత వైద్యశాలలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 40 మందికి పైగా వైద్య సేవలు అందజేశారు. వైద్యులు సాయిప్రసాద్‌రెడ్డి, సహచర వైద్యులు చికిత్సలు నిర్వహించారు. డాక్టర్ సాయి ప్రసాద్ రెడ్డి దంత రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, ఉపాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న వినాయక చవితి

కడప కల్చరల్ : వినాయక చవితి పర్వదినం గురించి సందిగ్ధత ఏర్పడడంతో ప్రజల్లో ఆ పండుగను 18, 19 తేదీల్లో ఎప్పుడు నిర్వహించుకోవాలన్న సందేహం నెలకొన్నది. కొన్ని క్యాలెండర్లు, పంచాంగాల్లో 19 అని, మరికొన్నింటిలో 18 అని ఉండడంతో ఆ పండుగను ఎప్పుడు నిర్వహించుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఈ అంశంపై జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు, పీస్ కమిటీ ప్రతినిధి విజయ్‌భట్టర్ స్పష్టత ఇచ్చారు. శాస్త్ర ప్రకారం సెప్టెంబరు 18నే పండుగను నిర్వహించుకోవాలని, ఈ విషయంగా వినాయక చవితి వ్రత కల్పం గ్రంథంలో స్పష్టంగా ఉందన్నారు.

రైతులు స్వయంగా నిర్ణయాలు తీసుకోవాలి

కమలాపురం : రైతులు తాము సాగు చేసే పంటల పెంపకంలో స్వయంగా నిర్ణయాలను తీసుకునే శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే పొలంబడి లక్ష్యం అని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో జరిగిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో వరిపంట సాగు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతును తన పొలానికి శాస్త్రవేత్తను చేయడమే డాక్టర్ వైఎస్సార్ పొలంబడి లక్ష్యం అన్నారు. నాట్లు నాటిన తర్వాత కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నారు నాటిన 24-48 గంటల్లో బ్యూటక్లోర్ 1 లీటరును ఏకరాకు ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. అలాగే ప్రత్యక్ష నిరూపణ పద్ధతి ద్వారా వేప గింజల కాషాయ ద్రావణం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కషాయం ద్వారా పురుగులను గుడ్డు దశలోనే నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మమత, వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వరాల పండుగకు ఘనంగా ఏర్పాట్లు

నేడు వరలక్ష్మి వ్రతం


వరలక్ష్మి మాత విగ్రహం

కడప కల్చరల్ : వరాల తల్లీ....వరలక్ష్మి.... మా పూజలందుకుని వరాలు ప్రసాదించవమ్మా...అంటూ మహిళా భక్తులు వరలక్ష్మి మాతను ప్రార్థించేందుకు సిద్ధమయ్యారు. హిందూ మహిళలు సౌభాగ్యం కోసం ప్రార్థించే పండుగల్లో శ్రీ వరలక్ష్మమాత వ్రతం ముఖ్యమైనది. సంవత్సరం రోజులపాటు ఎంతో ఓపికతో మహిళలు ఈ పండుగ కోసం ఎదురుచూస్తారు. వారం, పది రోజుల ముందునుంచే ఏర్పాట్లు ప్రారంభిస్తారు. అందులో భాగంగా కడప నగరంలో శుక్రవారం పండుగ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

■ పలుచోట్ల బ్రాహ్మణులు, వేద పండితుల ఆధ్వర్యంలో వరలక్ష్మివ్రతం కోసం అమ్మవారి కలశ ప్రతిష్ఠ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. మరికొన్నిచోట్ల సామూహిక వ్రతాల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. నగరంలో పేరున్న అమ్మవారి ఆలయాల్లో సామూహిక వ్రతాలు జరగనున్నాయి. శ్రావణమాసంలో వచ్చే ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే అమ్మవారు కరుణించి కోరిన వరాలిస్తారని, సౌభాగ్యం అందజేస్తారని భక్తుల విశ్వాసం.

■ వరాలనిచ్చే వరలక్ష్మిమాతకు పూజలు నిర్వహించడం పలు రకాలుగా శుభదాయకమని భావిస్తున్నారు. ఇందులో భాగంగా కడప నగరంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉదయం నిర్వాహకులు భక్తులచే సామూహికంగా అమ్మవారి వ్రతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం కూడా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయాలలో పూజల అనంతరం మహిళా భక్తులకు అందజేసేందుకు ప్రసాదంగా పసుపు, కుంకుమలు, గాజులను నిర్వాహకులు సిద్ధం చేసుకున్నారు. మరోవైపు టీటీడీ, దేవాదాయశాఖల సంయుక్తాధ్వర్యంలో జిల్లాలో ఎంపిక చేసిన ఆలయాలలో కూడా వరలక్ష్మి వ్రతాలను నిర్వహించనున్నారు.

మార్కెట్లలో సందడి

వరలక్ష్మివ్రతం నిర్వహణ సందర్భంగా మార్కెట్లు సందడిగా మారాయి. పలు కూడళ్లలో వ్యాపారులు గాజులు, పసుపు కుంకుమలు, వరలక్ష్మిమాత చిన్న పూజా విగ్రహాలు విక్రయించారు. వస్త్ర దుకాణాల్లో జాకెట్ పీసులకు మంచి డిమాండ్ ఏర్పడింది. మరీ ముఖ్యంగా ఈ వ్రతం సందర్భంగా అమ్మవారి దగ్గర ఐదు రకాల పూలు, ఐదు రకాల స్వీట్లు ఉంచాలన్న సంప్రదాయం ఉందని భక్తులు పూలు, అరటి పిలకలు, పండ్లు, స్వీట్ల కోసం రావడంతో మార్కెట్లు సందడిగా మారాయి. ముఖ్యంగా పండ్లు విక్రయించే బండ్లు, పూల దుకాణాల వద్ద విపరీతంగా రద్దీ కనిపించింది. పూలు, పండ్లను సాధారణ ధరల కంటే రెట్టింపు ధరలకు విక్రయించారు.


వస్త్ర దుకాణాల్లో సందడి


పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

టీడీపీ హయాంలో అన్నీ అక్రమాలే


మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీకి అధికారమిస్తే అరాచకత్వం రాజ్యమేలుతుందని, టీడీపీ హయాంలో అన్నీ అక్రమాలేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, మంత్రులను దూషించడానికే యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు భూములను, ఇసుకను, సహజ వనరులను దోచుకున్నారని, మైనింగ్ మాఫియాగా ఏర్పడి దోపిడీకి పాల్పడ్డారన్నారు. ప్రజలు టీడీపీని నమ్మరని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గౌస్, నాసిర్, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్చి మరమ్మతులకు ఆర్థిక సాయం

కడప నగరం ఫక్కీరుపల్లెలో ఉన్న చర్చి మరమ్మతులకు అఫ్జల్‌ఖాన్ ఆర్థిక సాయం చేశారు. గురువారం స్థానిక తన కార్యాలయంలో ఫాస్టర్ రాజన్నకు రూ.15 వేల నగదును అందించారు.

దేశసేవ చేసే అవకాశం రావడం మహాభాగ్యం


మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్. అభిలాష్


వైవీయూ : భారతదేశ గడ్డపై జన్మించిన మనకు దేశ సేవ చేసే అవకాశం వస్తే మహాభాగ్యంగా భావించి సేవలందించాలని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్. అభిలాష్ పేర్కొన్నారు. గురువారం వైవీయూలోని సర్ సీవీ రామన్ సైన్స్‌బ్లాక్‌లో మనోవిజ్ఞానశాస్త్రశాఖ, జాతీయసేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో 'జాతీయ సమైక్యత-భద్రత' అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యూపీఎస్సీ ద్వారా సైనిక విభాగంలో బాధ్యతలు చేపట్టానన్నారు. జమ్ముకాశ్మీర్‌లో జరిగిన పుల్వామా ఘటన సమయంలో విధుల్లో ఉన్న విషయం గుర్తుచేశారు. చైనా వంతెనను భారతదేశం స్వాధీనం చేసుకునే సమయంలో సైనికుల వీరోచిత పోరాటాన్ని వివరించారు. యూపీఎస్సీ పరీక్షల ద్వారా భారతసైన్యంలోకి రావాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, కార్యక్రమ కన్వీనర్లు డా. వేపరాల లాజరస్, డా. ఎస్. సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, సైకాలజీ సహ ఆచార్యులు డా. కె. లలిత పాల్గొన్నారు.

ఘనంగా 'మమ్మ' స్మృతి దినోత్సవం


మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రహ్మకుమారీలు

కడప కల్చరల్ : బ్రహ్మకుమారి ఈశ్వరీయా విశ్వవిద్యాలయ తొలి పరిపాలనాధికారి మాతేశ్వరి జగదంబ సరస్వతి (మమ్మ) 58వ స్మృతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఓం శాంతి నగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సాయంత్రం ఈ కార్యక్రమం చేపట్టారు. సంస్థ అదనపు ఏపీ, కర్ణాటక సబ్ జోన్ అధికారి, జిల్లా కో ఆర్డినేటర్ గీతా బెహన్ ఈ సందర్భంగా మమ్మ చిత్రపటానికి పూలమాల అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కార్యక్రమానికి హాజరైన వారికి మమ్మజీ గురించిన వివరాలను తెలిపారు. ఆమె జీవితం, సుగుణాలు, వ్యక్తిత్వం, జ్ఞానం ప్రేరణగా తీసుకుని ఆ మార్గంలో నడవాలని సూచించారు.

ప్రభువు మార్గాన్ని అనుసరించాలి


దైవ సందేశం ఇస్తున్న యోన

కడప కోటిరెడ్డిసర్కిల్ / కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఏసు ప్రభువు మార్గాన్ని అనుసరించి జీవితానికి సార్థకత చేకూరేలా నడుచుకోవాలని మద్రాసు దైవజనులు ఫాస్టర్ పి.యోన పిలుపునిచ్చారు. గురువారం నగర శివార్లలోని రామాంజనేయపురం ది పెంతకోస్తు మిషన్ చర్చిలో ప్రత్యేక బైబిల్ పఠనాలు, ద్వైవిక స్వస్థనిచ్చే ఆరాధనలు గురువారం నుంచి ఆదివారం వరకు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యోన మాట్లాడుతూ ఈ లోక రాజ్యము అశాశ్వతమైనదని, నిశ్చలమైన, దేవుని రాజ్యం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి సహచరులను గౌరవిస్తూ ప్రభువును ఆరాధించాలని సూచించారు. అనంతరం తిరుపతి ఫాస్టర్ ప్రసాద్‌రావు వ్యాధిగ్రస్తుల కోసం, రాష్ట్రం, దేశ క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలత, ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణసంస్థ డైరెక్టర్ డేవిడ్‌తోపాటు ఇతర గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.

లేబాకను సందర్శించిన డీఎంహెచ్ఓ

వల్లూరు : మండలంలోని పెద్ద లేబాక గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు గురువారం సందర్శించారు. మొదట గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. క్లీనిక్‌లో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. క్లీనిక్‌లో వైద్య సేవలు పొందుతున్న స్థానికులతో వైద్య సేవల గురించి, సిబ్బంది పనితీరు గురించి ఆరా తీశారు. షుగర్, బీపీ రోగులకు, హై రిస్క్ గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను గురించి ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, ఐరన్ మాత్రలతో పాటు ఇతర సేవలను గురించి ఆరా తీశారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు హెచ్‌బీ టెస్ట్ గురించి, పోషకాహార ఆవశ్యకత, హ్యాండ్ వాష్, పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్‌లు సుధాకర్, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయోత్సవ సభ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నూర్జహాన్

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం చంద్రయాన్ విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పిల్లలంతా జాతీయ జెండాలను చేతపట్టి ఉత్సాహంగా జేజేలు పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ నూర్జహాన్ మాట్లాడుతూ చంద్రయాన్ ప్రయోగ విజయం దేశం గర్వించదగ్గ అంశం అన్నారు. మన ప్రతిభ ప్రపంచ దేశాల్లో మారుమోగిపోతోందన్నారు. సైన్సు అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, దక్షిణామూర్తి చంద్రయాన్ ప్రయోగ దశలు గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ రాజారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రకటిత కరెంట్ కోతలను ఎత్తి వేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలో అప్రకటిత కరెంట్ కోతలను ఎత్తి వేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. గురువారం కరెంట్ కోతలను ఎత్తి వేయాలని కోరుతూ నగరంలోని బిల్టప్ సబ్ స్టేషన్ ఏఈ మురళీకి ఏఐటియూసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని రవీంద్ర నగర్, కాగితాల పెంట, చెమ్ముమియ్యాపేట, బాలాజీ నగర్ ప్రాంతాలలో రాత్రి వేళ కరెంట్ కోతలతో ఉక్కపోత, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటియూసీ నాయకులు మునెయ్య, మైనుద్దీన్ పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ విద్యార్థినికి అభినందన

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీ ఫైనలియర్ విద్యార్థిని వి. తేజస్వినికి పొట్రైట్ విభాగంలో అవార్డు లభించింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈనెల 19వ తేదీన విజయవాడలో నిర్వహించిన డా. భగవాన్‌దాస్, బండి రాజన్ మెమోరియల్ ఫొటోగ్రఫీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తేజస్వినికి ప్రోత్సాహక మెరిట్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ ఆ విద్యార్థినిని అభినందించారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు


వెంకయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక తెలుగుగంగకాలనీలోని వెంకయ్యస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుండే స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతిపూజ, గణపతిహోమం, రుద్రహోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం సానిక అరుంధతినగర్, సుగాలి కాలనీలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే వున్న అధికారులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉండకూడదని వారికోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆ పథకాల అమలు కోసం ఎంతో కృషిచేశారన్నారు. ఆ పథకాలతో లబ్ధిపొందిన ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఆ ఆనందాన్ని ఇలాగే కొనసాగించడానికి మళ్లీ మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడప గడపలో ప్రజలు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్నారన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి నేను సిద్ధంగా ఉన్నానన్నారు. అనంతరం చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ఆయనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

ప్లాంట్ పనులను పూర్తి చేయాలి


నానాపల్లె వద్ద ఎస్‌టీపీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలోని నానాపల్లె వద్ద కొత్త సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి ఎస్‌టీపీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్మిన్ బ్లాక్, పంప్‌హౌస్ పనులను వేగవంతం చేయాలన్నారు. సీవేజ్ పాయింట్లను పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి వచ్చేలా చూడాలన్నారు. ప్రతిరోజూ పనులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, నగరపాలక డీఈ రాజేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా కార్యక్రమం


వైవీయూలో ఫిట్ ఇండియా కార్యక్రమాల్లో విద్యార్థులు

వైవీయూ : వైవీయూలో 'ఫిట్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి పోటీలు ప్రారంభించి మాట్లాడారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 29న జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు, ఎంపీఏ విభాగాధిపతి డా. రెడ్డయ్య పాల్గొన్నారు.